క్లుప్తంగా

సమస్యల పరిష్కార వేదికకు హాజరు కావాలి

చీరాల టౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని తహసీల్దార్ కె.గోపికృష్ణ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఆదేశాలతో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలని సర్క్యులర్ జారీ చేశారని తహసీల్దార్ స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలన్నారు. అలానే మండలంలోని అన్ని గ్రామపంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధికి కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా పంచాయతీ, సచివాలయాల సమాచారం, అభివృద్ధి పనుల వివరాలతో విధిగా హాజరుకావాలని సూచించారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం శ్రావణ మాసం.. రోహిణి నక్షత్రం దశమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

అందుబాటులో ఎరువులు

చినగంజాం: మండలంలోని ప్రయివేట్ రిటైలర్స్, సొసైటీల వద్ద ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు గమనించాలని మండల వ్యవసాయాధికారి ఆర్. చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూరియా 173.53 ఎంటీఎస్, డీఏపీ 34.2 ఎంటీఎస్, ఎంటీపీ 51.35 ఎంటీఎస్, ఎస్ఎస్‌పీ 7.0 ఎంటీఎస్, కాంప్లెక్స్ 145 ఎంటీఎస్ రైతులకు కావాలసినంత అందుబాటులో ఉన్నాయని కొరత లేదన్నారు. ఎరువులు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రంలో బుధవారం నుంచి ఎరువులు అందుబాటులో ఉంచామని రైతులంతా వినియోగించుకోవాలని కోరారు.

పదో తరగతి విద్యార్థికి సత్కారం

చీరాల అర్బన్: రోటరీ క్లబ్ చీరాల, ఎస్ఆర్‌పీఎం హైస్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ 1992 బ్యాచ్ దోగుపర్తి వెంకట సురేష్ సారథ్యంలో ఆదివారం స్థానిక రోటరీ క్లబ్‌లో ఎస్ఆర్‌పీఎం హైస్కూల్‌లో 2024–2025 సంవత్సరంలో పదో తరగతిలో మొదటి స్థానం సాధించిన కోనాడ సంతోష్ తేజ్ అనే విద్యార్థికి సత్కారం నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్దన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థి కోనాడ సంతోష్ తేజకు సత్కరించి రూ.11,116 నగదు, జ్ఞాపిక, ప్రశంసపత్రం అందించగా మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు రూ.5,116 బహూకరించారు. రోటరీ సభ్యులు చేస్తున్న పలు సేవా కార్యక్రమాల గురించి కొనియాడారు. కార్యక్రమంలో చీరాల కృష్ణమూర్తి, తిరుమలశెట్టి లక్ష్మీ ప్రతాప్, పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ళ గురుప్రసాద్, డీవీ సురేష్, వలివేటి మురళీకృష్ణ, గుర్రం రాఘవరావు, మామిడాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

చీరాల టౌన్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యత, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈపురుపాలెం గ్రామ పంచాయతీ సెక్రటరీ మురళీబాపుజీ గ్రామస్తులకు సూచించారు. ఆదివారం మండలంలోని ఈపురుపాలెం గ్రామ పంచాయతీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డుల్లో పేరుకుని ఉన్న చెత్తకుప్పలను, చిల్లచెట్లను పొక్లెయిన్‌తో తొలగించారు. ఈసందర్భంగా పంచాయతీ సెక్రటరీ మాట్లాడారు. గ్రామంలోని నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడిచెత్త, పొడిచెత్తను బుట్టల్లో వేర్వేరుగా నిల్వ చేసి పారిశుద్ధ్య కార్మికులకు చెత్త బుట్టలను అందించాలన్నారు. జనావాసాల మధ్య చెత్త కుప్పలను నిల్వ చేయకూడదన్నారు. పరిసరాల శుభ్రతకు ప్రజలంతా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జనావాసాల మధ్య మురుగునీటి నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సెక్రటరీ వెంట పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలు

సంతమాగులూరు(అద్దంకి): రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలైన ఘటన మండలంలోని ఏల్చూరులో ఆదివారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన రత్తమ్మ అనే యువతి రోడ్డు దాటే క్రమంలో కారు ఢీ కొట్టింది. అయితే స్వల్ప గాయాలతో బయటపడటంతో ప్రమాదం తప్పింది. క్షతగాత్రురాలిని హైవే అంబులెన్స్‌లో నరసరావుపేట వైద్యశాలకు వైద్యం కోసం తరలించారు.

ఏ నిమిషాన ఏమి జరుగునో!

- ప్రమాదకరంగా గుండ్లకమ్మ వంతెన
- వంతెనపై నుంచి వెళుతున్న భారీ గ్రానైట్ వాహనాలు
- హెచ్చరిక బోర్డులను ఖాతరు చేయని వైనం
- పట్టించుకోని అధికారులు



వంతెనపై వెళుతున్న భారీ గ్రానైట్ వాహనం

అద్దంకి: అసలే దెబ్బతిన్న వంతెన, ఆ పైన భారీ వాహనాలు వెళితే ఇక ఆ వంతెన ఎన్నాళ్లు ఉంటుందో? అద్దంకి –దర్శి రహదారిలో గుండ్లకమ్మపై నిర్మించిన వంతెన పరిస్థితి ఇలా మారింది. ఈ వంతెన నిర్మాణంలో లోపమో, శాపమో తెలియదు కాని, రెండు దశాబ్దాల క్రితం రెండో స్పాన్ కుంగిపోయింది. తరువాత మరమ్మతులు చేసినా తేలికపాటి వాహనాలు, బస్సులు కార్లు వంటివి పోవడానికి మాత్రమే అవకాశం ఉంది. ప్రస్తుతం దర్శి వైపు నుంచి భారీ గ్రానైట్ వాహనాలు రాత్రి సమయాల్లో వస్తుండటంతో వంతెనకు గండం ఉందని చెప్పక తప్పదు. అద్దంకి, తిమ్మాయపాలెం గ్రామాల మధ్యలో 1980కి ముందు వంతెన మార్గం లేదు. ఎవరైనా వెళ్లాలంటే నదిలో దిగి వెళ్లాల్సిందే. నది పొంగితే పడవలపై వెళ్లేవారు. ఆ క్రమంలో అప్పటి అద్దంకి ఎమ్మెల్యే కరణం బలరాం వెంతెన మంజూరు చేయించారు. నిర్మాణం పూర్తయిన తర్వాత 1981లో వంతెనను అప్పటి సీఎం నందమూరి తారకరామారావు వంతెన ప్రారంభించారు. ఆ తరువాత దర్శి వైపు నుంచి అద్దంకి వైపునకు వెళ్లే వాహన రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి. ఈ క్రమంలో నిర్మాణంలో లోపమో? శాపమో తెలియదు కాని, వంతెనకు వేసిన 15 స్పాన్స్‌లో తిమ్మాయపాలెం వైపు నుంచి రెండో స్పాన్, మూడో స్పాప్ మధ్యలోనున్న భాగం వంగింది. దీంతో అధికారులు దానికి మరమ్మతులు నిర్వహించారు. తరువాత వెయిట్ చెకింగ్‌తో వాహన రాకపోకలకు పునరుద్ధరించారు. అయితే తరువాత మరలా వంగిపోతుండడంతో వంతెన ప్రమాదకర పరిస్థితుల్లో ఉంది. భారీ వాహనాల రాకపోకలు నిషేధిస్తూ బోర్డు పెట్టారు. అయితే వంతెన మీద హెచ్చరిక బోర్డు పెట్టినా, ఇటీవల దర్శి వైపు నుంచి భారీ గ్రానైట్ వాహనాలు రాత్రి సమయాల్లో వెళ్తున్నాయి. ఈ క్రమంలో వంతెనకు ముప్పు తప్పదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకుని గ్రానైట్ వాహన రాకపోకలను నిలిపేయాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ శివన్నారాయణను వివరణ కోరగా వంతెనపై భారీ వాహనాల రాకపోకలను నిషేధించామన్నారు. భారీ వాహనాలు వెళ్లవద్దనే హెచ్చరిక బోర్డు పెట్టామని.. ఎవరైనా వెళితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మురుగుమయం.. దుర్గంధం



వల్లాపల్లి ఎస్టీ కాలనీలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

బల్లికురవ: మురుగు కాలువల్లో మురుగు ముందుకు కదలక రోడ్లపై ప్రవహించటంతో సీజనల్ జ్వరాలు వ్యాధులు సోకుతాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండలంలోని వల్లాపల్లి ఎస్టీ కాలనీ, పాతమాల్లాయపాలెం ఎస్సీ కాలనీ, యానాది సంఘం, సిపాయి కాలనీ, కొప్పరపాడు గ్రామాల్లో ముందుకు కదలని మురుగుతో దోమల దాడి జరిగింది. పగలు, రాత్రి తేడా లేకుండా దోమల దాడితో ప్రజలకు కంటిమీద కునుకు ఉండటం లేదు. గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు స్పెషల్ డ్రైవ్‌గా చేపట్టాలని అధికారులు ఆదేశిస్తున్నా పనులు మాత్రం ముందుకు సాగకపోడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గంగమ్మ తల్లికి పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి



గంగమ్మతల్లికి పూజలు చేసేందుకు వచ్చిన భక్తులు

కారంచేడు: భక్తుల ఆపదలను తీర్చే కల్పవల్లిగా కారంచేడు గ్రామ దేవతగాను విరాజిల్లుతున్న గంగమ్మ తల్లికి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. శ్రావణ మాసం ఆదివారం అమ్మవారికి ప్రీతికరమైన రోజు అని భక్తులు విశ్వాసం. కాగా అమ్మవారికి వేకువ జామునుంచే భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణలు నిర్వహించి పొంగళ్ళను నైవేద్యంగా సమర్పించారు. వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు తమ సాగుకు ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. అదే విధంగా ఉద్యోగాల్లో చేరిన ఉద్యోగులు తమ మొక్కులు తీర్చుకునేందుకు ఆలయానికి విచ్చేశారు. అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు రాజేష్ తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు.

పనులు పూర్తికాకుండానే డైవర్షన్ రోడ్డు తొలగింపు

- మూడు మండలాల్లోని 30 గ్రామాల వాహన చోదకులు, ప్రజల అవస్థలు



అద్దంకి బ్రాంచ్ కాలువ దాటే చోట డైవర్షన్ రోడ్డును తొలగిస్తున్న దృశ్యం

బల్లికురవ: సాగర్ కాలువకు నీటి విడుదల సమయంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టంతో 3 మండలాల్లోని 30 గ్రామాల ప్రజలకు వాహన చోదకులకు అవస్థలు తప్పటంలేదు. ఈ పరిస్థితులకు తోడు ఆదివారం పనులు పూర్తికాక ముందే డైవర్షన్ రోడ్డును ముందస్తు సమాచారం లేకుండా తొలగించటంతో వాహన చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. బల్లికురవ–అద్దంకి ఆర్అండ్‌బీ రోడ్డులోని వల్లాపల్లి–ధర్మవరం గ్రామాల మధ్య అద్దంకి బ్రాంచ్ కాల్వ 33/0 వద్ద గతంలో ఉన్న పాత బ్రిడ్జిని స్థానంలో హైలెవల్ బ్రిడ్జికి 2 నెలల క్రితం రూ. 1.65 కోట్లు నిధులు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ వర్షాకాలం సాగర్ కాలువలకు నీటి విడుదల చేస్తారన్న ఆలోచన లేకుండా పనులను చేపట్టారు. నిర్మాణ పనుల్లో భాగంగా చేపట్టిన డైవర్షన్ రోడ్డుకు ఎర్రమట్టి తోలకుండా అక్కడే ఉన్న బంక మట్టిని తోలడంతో జారుడు బల్లను తలపిస్తున్నాయి. ఆదమరిస్తే 20 అడుగుల లోతులో ఉన్న అద్దంకి బ్రాంచ్ కాలువలో పడి ప్రమాదం బారిన పడినట్లే ప్రమాద విషయాన్ని పత్రికల్లో కథనాలు ప్రచురించారు. దీంతో అధికారులు, కాంట్రాక్టర్ ముందస్తు సమాచారం లేకుండా డైవర్షన్ రోడ్డును తొలగించే పనులు చేపట్టారు. బల్లికురవ, సంతమాగులూరు ప్రాంతాల నుంచి అద్దంకి వెళ్లే వాహన చోదకులు అద్దంకి నుంచి బల్లికురవ ప్రాంతం వెళ్లాల్సిన వాహన చోదకులు డైవర్షన్ వరకు వచ్చి తవ్వడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేసేదిలేక తిట్ల దండకంతో వెనుదిరుగుతున్నారు. డైవర్షన్ రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధితో రాకపోకలకు ఇబ్బంది తొలగించాలని బల్లికురవ, సంతమాగులూరు, అద్దంకి మండలాల్లోని 30 గ్రామాలు, వాహన చోదకులు వేడుకుంటున్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయమందుకున్న బంగారు కుటుంబాల్లోని విద్యార్థులు

చినగంజాం: మండలంలోని గొనసపూడి గ్రామానికి చెందిన విక్రం నారాయణరావు.. బంగారు కుటుంబాల్లోని విద్యార్థులకు విద్యకు ఆర్థిక సాయాన్ని అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలోని పెదగంజాం పంచాయతీలో సీఎం చంద్రబాబు నాయుడు విచ్చేసిన కొత్తగొల్లపాలెం గ్రామంలో పీ4 సర్వేలో భాగంగా ఆయనకు అప్పగించిన 15 కుటుంబాల్లోని విద్యార్థులను చదివించే కార్యక్రమాన్ని ముందుగా నారాయణరావు చేపట్టారు. విద్యార్థులు ఎల్లావుల గణేష్, మద్దిన నాగార్జున, కిలారి దివ్య, ఎల్లావుల సుధీర్, ఎల్లావుల ప్రభాకర్, గోనె హేమలత ల చదువుకు అవసరమైన ఫీజులు చెల్లించారు. అంతే కాకుండా ఆదివారం గొనసపూడి గ్రామంలోని విక్రం నారాయణరావు స్వగృహంలో వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో విక్రం నారాయణరావు, ఏపీఎం సుబ్బారావు, పాదవీరయ్య, శ్రీహరి, రాము, వెంకట్రావు, శారద తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో చెత్త.. జనాలకు చింత



ప్రభుత్వాసుపత్రి ప్రహరీ పక్కన పేరుకుపోయిన చెత్తకుప్పలు

–దోమలు వ్యాప్తి చెందుతున్నా పట్టించుకోని అధికారులు

చీరాల రూరల్: పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ప్రజలు అటువైపుగా వెళ్లాలంటే ముక్కులు మూసుకుని వెళ్లాల్సిందే. పరిసర ప్రాంతాలకు చెందిన ఇళ్లల్లో నుంచి వచ్చే చెత్తాచెదారాలను మున్సిపల్ కార్మికులు చిన్న ట్రాలీలతో పేరాల్లోని ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూలు ప్రహరీ పక్కన డంప్ చేస్తున్నారు. కార్మికులు డంప్‌చేసే చెత్తాచెదారాలను ప్రతిరోజూ మున్సిపల్ ట్రాక్టర్ ద్వారా చెత్త తరలింపు కేంద్రానికి తీసుకెళతారు. అయితే గత నాలుగు రోజులుగా ట్రాక్టర్‌తో చెత్త తరిలించకపోవడంతో విపరీతంగా చెత్తచెదారాలు పేరుకుపోయాయి. పేరుకుపోయిన చెత్తకుప్పలపై పందులు, ఆవులుచేరి పెకళిస్తుండటంతో పరిసరాలన్నీ కంపుకొడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్కూలు ప్రహరీ పక్కన కావడంతో విద్యార్థులు కూడా అవస్థలు పడుతున్నారు. అలానే వెంగళరావు నగర్‌లోని ఓ మసీదు ముందు చెత్తను డంప్ చేస్తున్నారు. అక్కడ కూడా ఇదేవిధమైన పరిస్థితి నెలకొంది. పేరుకుపోయిన చెత్తను కార్మికులు తొలగించకపోవడంతో పరిసరాలన్నీ కంపుకొడుతున్నాయి. పేరుకుపోయిన చెత్తకుప్పలకు ఎదురుగా మసీదు ఉండడంతో ముస్లిం సోదరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలానే ధమ్సఅప్ గోడౌన్ పక్కన కూడా ఇదే విధమైన పరిస్థితి ఉంది. అలానే జయంతిపేట శ్మశాన వాటిక వద్ద కూడా చెత్తా చెదారాలు పోరుకుపోతున్నాయి. చీరాల నుంచి కొత్తపేట వెళ్లే రోడ్డు ప్రభుత్వాసుపత్రి ప్రహరీ పక్కన కూడా ఇదే పరిస్థితి నెలకొంది. చెత్తాచెదారాలు ఎక్కువడటంతో రోడ్డు పైకి వస్తున్నాయి. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో ఇదే విధమైన దర్శనమిస్తున్నా మున్సిపల్ కమిషనర్, ఇతర పారిశుద్ధ్య అధికారులు మిన్నకుండిపోతున్నారు. ప్రతిరోజూ పర్యవేక్షణచేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన అధికారులు వారి పర్యవేక్షణ లేకపోవడంతో కార్మికులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అసలే వర్షాలు విపరీతంగా పడుతున్నాయి. పేరుకుపోయిన చెత్తారాలపై దోమలు వ్యాప్తిచెందే అవకాశం ఉంది. ఇప్పటికే కొందరు చిన్నారులు జ్వరాలు బారినపడి ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందుతున్నారు. ఇకనైనా అధికారులు నిద్రలేచి పట్టణ ప్రజల ప్రజారోగ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



పేరాల ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూలు ప్రహరీ పక్కన పేరుకుపోయిన చెత్తకుప్పలు



వెంగళరావు నగర్‌లోని మసీదు ఎదురుగా తొలగించకుండా ఉన్న చెత్తచెదారం

అమ్మవార్లకు విశిష్ట పూజలు



బల్లికురవలోని పోలేరమ్మకు వస్త్రాలు సమర్పించిన భక్తుడు

బల్లికురవ: శ్రావణ మాసం చివరి ఆదివారం సందర్భంగా గ్రామ దేవతలకు విశిష్ట పూజలతోపాటు ప్రత్యేకంగా అలంకరించారు. బల్లికురవ, గుంటుపల్లి, నక్కబొక్కలపాడు, కొత్తపాలెం, గొర్రెపాడు, కొప్పర పాలెం, వల్లాపల్లి గ్రామాల్లోని గ్రామదేవతలైన పోలేరమ్మ, అంకమ్మ, గంగమ్మ ఆలయాల్లో అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకం చేపట్టి ప్రత్యేకంగా ఆలంకరించారు. పాడిపంటలతో తమ కుటుంబాలను కాపాడాలని అమ్మవార్లను ప్రార్థించి తమ మొక్కులు తీర్చుకున్నారు. బల్లికురవలోని ఆలయంలో భక్తుడు చల్లగుండ్ల శ్రీనివాసరావు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. రాత్రికి ఆయా గ్రామాల్లోని ఆలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వాసవి అమ్మవారికి గాజుల అలంకరణ



గాజుల అలంకరణలో వాసవి అమ్మవారు

అద్దంకి రూరల్: అద్దంకిలో వేంచేసి ఉన్న శ్రీచక్రసహిత వాసవీ కన్యాకా పరమేశ్వరీ అమ్మవారికి శ్రావణ మాసం చివరి ఆదివారం సందర్భంగా 25 వేల గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ అలంకరణ గురువారం వరకు ఉంచుతారని భక్తులు అమ్మవారిని దర్శించుకోవచ్చని ఆలయ అర్చకుడు స్వర్ణ వెంకట సుబ్బారావు తెలిపారు.

మొక్కలతో పర్యావరణానికి రక్షణ




మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్న రోటరీ ప్రతినిధులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు

పర్చూరు(చినగంజాం): మొక్కలు పర్యావరణాన్ని కాపాడతాయని పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ అన్నారు. మండలంలోని నాగులపాలెం బధిరుల పాఠశాల ఆవరణ, చుట్టుపక్కల ప్రాంతాల్లో రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు పర్యావరణాన్ని కాపాడతాయని మానవులకు ఎంతో ఉపయోగమన్నారు. అనంతరం మొక్కలు నాటి, నాటిన మొక్కలను విద్యార్థులకు దత్తత చేశారు. మొక్కలను సంరక్షించి పెంచి పోషించే బాధ్యతలను వారికి అప్పగించారు. మొక్కలను సంరక్షించాల్సిందిగా వారికి సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి కోమటి ఆంజనేయులు, అసిస్టెంట్ గవర్నర్ నాగబైరు శ్రీనివాసరావు, నాగుబడి సుబ్బారావు, కొల్లా సుబ్బారావు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

చీరాల రూరల్: మండలంలోని రైతులకు యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి నిర్మల తెలిపారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో ఆగస్టు నెలాఖరులో రైతులు వరినార్లు పోస్తారని, అక్టోబర్ నెలలో మొక్కజొన్న విత్తనాలు పొలాల్లో విత్తుతారని చెప్పారు. రైతులకు అవసరమైన యూరియా 72 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 250 ఎంటీ, డీఏపీ, 30 ఎంటీలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. త్వరలో రైతు సేవా కేంద్రాల్లో కూడా ఈ ఎరువులను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. మండలంలోని రైతు సోదరులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విశ్వవాణి లక్ష్యం సువార్త వ్యాప్తి



రెవరెండ్ భక్తవత్సలం

చీరాల రూరల్: దేవుని సువార్తను నలుదిశలా వ్యాప్తి చేయడమే విశ్వవాణి మినిస్ట్రీస్ ముఖ్య ఉద్దేశమని రెవరెండ్ భక్తవత్సలం అన్నారు. ఆదివారం స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చిలో విశ్వవాణి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంఘ కాపరులు నిర్వహించే ఆరాధనా క్రమాలను విశ్వవాణి ప్రతినిధులు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన రెవరెండ్ భక్తవత్సలం వాక్య సందేశం అందించారు. దేశ వ్యాప్తంగా క్రీస్తు సువార్తను అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ఉత్తర భారతంలోని కొన్ని రాష్ట్రాల్లో సువార్త అందించడం చాలా కష్టతరంగా ఉందని.. దాతల సహాయ సహకారాలతో దేవుని మందిరాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు.

గొర్రెలు, మేకల పెంపకందారులపై నిర్లక్ష్యం



ద్వారకపాడులో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘాల నాయకులు

మార్టూరు: కూటమి ప్రభుత్వంలో గొర్రెలు, మేకల పెంపకం దారుల సహకార సంఘాలు నిధులు లేక నిర్వీర్యం అవుతున్నాయని ఆంధ్ర ప్రదేశ్ గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సంపతి నాగరాజు, తోట తిరుపతి రావు అన్నారు. జొన్నతాళి, వలపర్ల, ద్వారకపాడు గ్రామాల్లోని గొర్రెలు, మేకల పెంపకం దారులతో ఆదివారం నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీ కార్పొరేషన్ల ద్వారా 50 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేస్తామని చెప్పి మరచారని విమర్శించారు. రాష్ట్రంలో ఐదు కోట్లకు పైగా గొర్రెలు, మేకలు ఉన్నాయని వాటి ద్వారా ప్రభుత్వానికి సాలీనా 16 వేల కోట్ల రూపాయలు ఆదాయం వస్తున్నప్పటికీ జీవాల పెంపకం దారుల సంక్షేమం మాత్రం ప్రభుత్వానికి పట్టడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. 5 వేలకు పైగా జీవాల పెంపకం దారుల సహకార సంఘాల్లో లక్ష మందికి పైగా సభ్యులు వారి కుటుంబాలు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని ప్రభుత్వ పరంగా ఎలాంటి సహాయ సహకారాలు అందడం లేదని ఆరోపించారు. మేకలు, గొర్రెలు పెంపకం దారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 26,27వ తేదీల్లో ఒంగోలులో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలకు గొర్రెలు, మేకలు పెంపకం దారులు సహకార సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు కరపత్రాలను ఆవిష్కరించారు. గొర్రెలు, మేకల పెంపకం దారుల సహకార సంఘాల నాయకులు బొల్ల పేరయ్య, గోరంట్ల బాలకోటయ్య, గోరంట్ల ఆంజనేయులు, చట్టి సాంబశివరావు, గోరంట్ల పెద్ద ఎలమంద, చట్టి పెద్దిరాజు, సంపతి చెంగలయ్య, సంపతి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వర స్వామి ఆలయంలో శ్రీచక్ర పూజలు



ఆలయంలో పూజ కార్యక్రమాలను నిర్వహిస్తున్న రామకృష్ణ దంపతులు

ఇంకొల్లు(చినగంజాం): స్థానిక గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రీ చక్రపూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పాలేరు రామకృష్ణ దంపతులు ఆలయానికి శ్రీచక్రం బహూకరిస్తున్న సందర్భంగా ఆలయంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కావలికి చెందిన కావూరి కోటేశ్వర శర్మ ఆద్వర్యంలో గుండా పంతుల రామ సుబ్రహ్మణ్య శర్మ, మల్లిఖార్జున శర్మ,రాఘువ, మునీంద్ర, గోపినాథ్ పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి ఇంకొల్లు సాంబశివరావు, రామకృష్ణ కుటుంబీకులు పాల్గొన్నారు.